సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 15 । నవంబర్ । 2023



రూ.1,16,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అమ్మిజూరి నవీన్‌కుమార్, వైష్ణవి దంపతులు (జీలుగుమిల్లి) మంగళవారం రూ.1,16,116 విరాళం సమర్పించారు.



రూ.25 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు మునుమూరి శేషగిరి రావు, వెంకట రాజేశ్వరి దంపతులు (మడికి) మంగళవారం రూ.25 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు మంగళవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పాలనాదక్షుడు పండిట్ నెహ్రూ



నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గొప్ప పాలనాదక్షుడు, దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని, స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా దేశ ప్రజాస్వామ్య, ఆర్థిక వ్యవస్థలకు గట్టి పునాదులు వేశారని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నెహ్రూ చిత్రపటానికి మంగళవారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం పొందిన అనంతరం మనం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచుకునేలా చేయడంలో, విశిష్ట రాజ్యాంగం ఏర్పాటులో నెహ్రూ చేసిన కృషి అసామాన్యమైనదని అన్నారు. ప్లానింగ్ కమిషన్ ఏర్పాటు చేసి, పంచవర్ష ప్రణాళికలతో రాష్ట్రాలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేశారన్నారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో భాగంగా అనేక ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. మంత్రివర్గ సహచరులు, ప్రతిపక్షాల అభిప్రాయాలకు విలువనివ్వడం ద్వారా పార్లమెంటరీ సంప్రదాయాల గౌరవప్రతిష్ఠలను పెంచారని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి రూ.3.23 లక్షల విరాళం



కలెక్టర్ శుక్లా, సైనిక సంక్షేమ అధికారికి నమూనా చెక్ అందిస్తున్న మెప్మా పీడీ తదితరులు

అమలాపురం రూరల్: జిల్లా సైనిక సంక్షేమ నిధికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.3,22,927 విరాళం అందించారు. దీనికి సంబంధించిన చెక్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ సత్యప్రసాద్‌లకు మెప్మా పీడీ బి.ప్రియంవద మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచీ సేకరించిన నిధిని అమరవీరుల, దివ్యాంగ సైనికుల కుటుంబాల పునరావాసం, సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్నారని చెప్పారు. పీడీ ప్రియంవద మాట్లాడుతూ, మెప్మా స్వయం సహాయక సభ్యులు ఒక్కొక్కరు రూ.10 చొప్పున అమలాపురంలో రూ.82,240, ముమ్మిడివరంలో రూ51,000, మండపేటలో రూ.1,15,787, రామచంద్రపురంలో రూ.73,900 చొప్పున విరాళాలు అందించారని వివరించారు. కార్యక్రమంలో డీపీఎంయూ శ్రీనివాస్, అమలాపురం, మండపేట సిటీ మిషన్ల మేనేజర్లు రామలక్ష్మి, అనంతలక్ష్మి, రామచంద్రపురం, ముమ్మిడివరం టౌన్ మిషన్ల కో ఆర్డినేటర్లు మంగాదేవి, ఐఏ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి సహకార సోపానం

- ప్రారంభమైన సహకార వారోత్సవాలు
- సభ్యుల సంక్షేమాన్ని కాంక్షిస్తూనే పరపతేతర వ్యాపారాలపై దృష్టి

అమలాపురం టౌన్: పూర్వం ఒకరి కోసం అందరు.. అందరి కోసం ఒకరు.. అనే స్ఫూర్తితో పరస్పర సహకారం అందించుకునే వారు. రైతులు కూడా సాగులో ఇదేవిధంగా సహకారం అందించుకునేవారు. పరిణామ క్రమంలో ఆ సహకారం ఓ వ్యవస్థగా ఏర్పడి నేడు సహకార రంగంగా అభివృద్ధి చెందింది. తర్వాత ప్రభుత్వ రంగ సంస్థగా రూపాంతరం చెందింది. నాటికీ నేటికీ సంఘీభావ స్ఫూర్తితో సహకార వ్యవస్థ అందరినీ ఒక గొడుగు కిందకు తీసుకువచ్చి, అందరి పురోగతి దిశగా అడుగులు వేస్తోంది. ఈ స్ఫూర్తితోనే ఏటా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకూ సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర సహకార యూనియన్ ఇచ్చిన మార్గదర్శకాలతో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీనికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాలోని 298 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)తో పాటు 52 డీసీసీబీ బ్రాంచిల పరిధిలో ఆయా సంఘాలు, బ్రాంచీల ఆధ్వర్యాన ఈ సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహరావు, జనరల్ మేనేజర్ పీఎస్ ప్రకాశంతో పాటు మూడు జిల్లాల సహకార అధికారులు (డీసీఓ) ఈ వారోత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని 166 సంఘాలు, 25 డీసీసీబీ బ్రాంచిలలో ఉత్సవాల తొలి రోజున సహకార పతాకం ఆవిష్కరించారు. అలాగే సహకార సంఘాల్లో ఇటీవల చోటు చేసుకున్న ప్రగతి పరిణామాలపై చర్చించారు.

పెరిగిన ప్రాధాన్యం

గతంలో కేంద్ర వ్యవసాయ శాఖ పరిధిలో ఉండే సహకార శాఖకు ఇప్పుడు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కల్పించడంతో దీని ప్రాధాన్యం పెరిగింది. ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్ (ఆప్కాబ్), డీసీసీబీ, సహకార సంఘాలు ఇలా మూడంచెల విధానంతో ఈ రంగం ద్వారా రైతులకు సేవలు అందుతున్నాయి.



సహకార స్ఫూర్తిని రగిలించే ఏడు రంగుల జెండా

ఒకవైపు రైతులకు పంట రుణాలు ఇస్తున్న సహకార వ్యవస్థ.. అవే సంఘాల ద్వారా పరపతేతర వ్యాపారాలు చేయిస్తూ లాభాల బాటలో అడుగులు వేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న సంఘాలను గుర్తించి బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా సహకార శాఖ చర్యలు చేపడుతోంది. రాజమహేంద్రవరంలోని రామదాసు సహకార శిక్షణ కేంద్రం సంఘాల సీఈఓలకు తరచూ సహకార నిబంధనలపై శిక్షణ ఇస్తోంది.

సహకార స్ఫూర్తిని పెంచేలా..



డీసీసీబీ ఆధ్వర్యాన సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. సభ్యుల్లో సహకార స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ వారోత్సవాలను వేదికగా మలచుకుంటాం. అంతే కాకుండా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా చైతన్యం కల్పిస్తాం.

– ఆర్‌వీ నరసింహరావు, సీఈఓ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, కాకినాడ

దేశంలో సహకార వ్యవస్థ ఎలా పుట్టింది.. దాని పరిణామక్రమాలు, విజయగాథలు, సహకారోద్యమకారుల గాథలు వంటి అంశాలను ఈ వారోత్సవాల్లో ప్రస్తావిస్తారు. సహకార స్ఫూర్తిని రగిలించేలా 1923లోనే ఏడు వర్ణాలతో సహకార జెండా రూపకల్పన జరిగింది. ఒక్కో రంగు ఒక్కో స్ఫూర్తిని కలిగించేలా ఈ జెండాను రూపొందించారు. జెండాలోని ఎరుపు రంగు సభ్యుల కార్యదీక్షకు, నారింజ రంగు స్నేహ భావానికి, పసుపు శాంతి స్వభావానికి, ఆకుపచ్చ సంఘ ఆర్థిక పరిపుష్టత, నీలం సభ్యుల పవిత్ర మనసు, నీలి ఊదా రంగు సమానత్వానికి, ఊదా రంగు నీతి నియమాలకు ప్రతీకగా నిర్దేశించారు.

నేటి నుంచి వారోత్సవాల్లో చర్చించే అంశాలు

15-11-2023	సంఘాల ఆర్థిక పునరుజ్జీవం
16-11-2023	డిజిటలైజేషన్ కోసం సాంకేతికతను స్వీకరించడం, అనువర్తీకరణ.
17-11-2023	అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో వ్యాపారం సరళతరం చేయడం.
18-11-2023	సభ్యుల భాగస్వామాన్ని పెంచుతూ బలోపేతం చేయడం.
19-11-2023	మహిళలు, యువత, రైతుల కోసం చేస్తున్న కృషి.
20-11-2023	సహకార విద్య, శిక్షణ పునర్నిర్మాణం

సమష్టి సహకారంతోనే సమాజాభివృద్ధి

- డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు
- అమలాపురంలో సహకార వారోత్సవాలకు శ్రీకారం

అమలాపురం టౌన్: సభ్యులంతా సంఘాలుగా ఏర్పడి, సమష్టిగా పరస్పరం సహకరించుకుంటేనే సమాజాభివృద్ధి సాకారమవుతుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. స్థానిక డీసీసీబీ బ్రాంచి ప్రాంగణంలో సహకార వారోత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. తొలుత సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆకుల వీర్రాజు మాట్లాడుతూ, ఇటీవల కాలంలో సహకార చట్టం ద్వారా అమలవుతున్న సంస్కరణలు సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని అన్నారు. మరో ముఖ్య అతిథి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ అధ్యక్షుడు పి.ఫణి పేర్రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి అమిత్‌షా ఆధ్వర్యాన సహకార సంఘాలకు ఎంతో మేలు జరగనుందని చెప్పారు. మరో అతిథి, ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన పథకాలు, అమలు చేస్తున్న నిర్ణయాలు వ్యవసాయ, రైతు సంక్షేమానికి, సహకార రంగ అభివృద్ధికి ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. అనంతరం జిల్లా సహకార అధికారులు, డీసీసీబీ డైరెక్టర్లు, సంఘాల సీఈఓలు, రైతు ప్రతినిధులతో డీసీసీబీ చైర్మన్ వీర్రాజు సహకార ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అల్లవరం మండలం కొమరిగిరిపట్నం వ్యవసాయ సహకార సంఘానికి మంజూరైన జన ఔషధ కేంద్రం అనుమతి పత్రాలను ఆ సంఘ అధ్యక్షుడు గుర్రం బాబులు, సీఈఓ కొమ్మూరి సత్తిబాబులకు వీర్రాజు అందజేశారు. జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఎ.రాధాకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డీసీసీబీ జనరల్ మేనేజర్ పీఎస్ ప్రకాశం, సహకార వారోత్సవాల జిల్లా పర్యవేక్షణ అధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్లు బండారు సత్తిరాజు, ఇళ్ల గోపాలకృష్ణ, అమలాపురం డివిజన్ సహకార అధికారి టి.బుజ్జియ్య కూడా ప్రసంగిస్తూ సహకార వారోత్సవాల ప్రాధాన్యాన్ని వివరించారు.



సహకార ప్రతిజ్ఞ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర సహకార యూనియన్ అధ్యక్షుడు ఫణి పేర్రాజు తదితరులు

దిశ యాప్.. డౌన్‌లోడ్‌లో టాప్

- జిల్లావ్యాప్తంగా మెగా డ్రైవ్
- ఒక్క రోజులో డౌన్‌లోడ్ చేసుకున్న 21 వేల మంది మహిళలు



మహిళతో దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ చేయిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్, పోలీసు సిబ్బంది

అమలాపురం టౌన్: దిశ యాప్‌ను మహిళలు, యువతులు, బాలికల మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ చేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం మెగా డ్రైవ్ నిర్వహించారు. ఇందులో జిల్లా రాష్ట్రంలోనే టాప్‌లో ఉందని ఎస్పీ సుసరావు శ్రీధర్ తెలిపారు. కర్నూలు జిల్లా 14 వేల డౌన్‌లోడ్లు జరగగా.. కోనసీమ జిల్లాలో 21 వేల మేర జరిగాయన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకూ జిల్లాలోని ఆర్టీసీ బస్ స్టేషన్లు, షాపింగ్ మాల్స్, ముఖ్య కూడళ్లలో ఈ మెగా డ్రైవ్ నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో మరో నాలుగు రోజులు జరిగే ఈ డ్రైవ్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా కూడా ఈ మెగా డ్రైవ్‌ను పర్యవేక్షించారు. అమలాపురం, దిశ, కొత్తపేట, రామచంద్రపురం డీఎస్పీలు ఎం.అంబికా ప్రసాద్, సుంకర మురళీమోహన్, రమణ, ప్రసాద్‌ల ఆధ్వర్యాన ఈ డ్రైవ్‌లు జరిగాయి. అమలాపురం డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యాన పోలీసు సబ్ డివిజన్‌లో పలుచోట్ల సీఐలు, ఎస్సైలు ముఖ్యంగా మహిళా పోలీసులు మహిళలతో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అమలాపురంలోని మూడు షాపింగ్ మాల్స్‌లో కొనుగోళ్లకు వచ్చిన మహిళలు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే 15 శాతం డిస్కౌంట్ ఇచ్చి, ప్రత్యేకంగా ప్రోత్సహించారు.

ఉభయ తారకంగా..



- విద్యాదీవెన'కు ఉమ్మడి ఖాతా తప్పనిసరి
- విద్యార్థులకు నిధుల జమ తెలిసేలా చర్యలు
- సక్రమంగా ఫీజు చెల్లింపునకు మార్గం సుగమం
- ఎస్సీ, ఆఖరి ఏడాది విద్యార్థులకు మినహాయింపు

జిల్లా	మొత్తం విద్యార్థులు	ఖాతాలు తెరవాల్సినవారు
కాకినాడ	44,524	25,350
కోనసీమ	35,255	17,524
తూర్పు గోదావరి	33,664	18,286

నాలుగో విడత విద్యా దీవెన

కాకినాడ జిల్లా	:	రూ. 21 కోట్లు
కోనసీమ జిల్లా	:	రూ.16 కోట్లు
తూర్పు గోదావరి	:	రూ.14 కోట్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోంది. తద్వారా పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి మార్గం చూపుతోంది. ఇందులో భాగంగానే జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలతో సాయపడుతోంది. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను మరింత పకడ్బందీగా నిర్వహించాలని తాజాగా ఆదేశించింది. విద్యా దీవెన కింద ఇంతవరకూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోంది. ఖాతాల్లో జమయ్యాక ఆ సొమ్మును వారు కాలేజీ యాజమాన్యాలకు ఫీజుగా అందజేస్తున్నారు. ఇలా ఖాతాల్లో నగదు జమయిన విషయం తల్లిదండ్రులు చెబితే తప్ప కొందరు విద్యార్థులకు తెలియడం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి తెస్తుంటే వారు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థితో పాటు తల్లి పేరుతో ఉమ్మడి బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఈ నెల 24లోగా ఉమ్మడి బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం కింద ఈ నెల 28న ప్రభుత్వం నిధులు జమ చేయనుంది.

ముందుచూపుతో జాగ్రత్తలు

ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ తదితర కోర్సుల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద కోర్సును బట్టి ప్రభుత్వం రూ.15 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉమ్మడి ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విద్యాదీవెన సొమ్మును ఆధార్ కార్డుల ఆధారంగా ఆన్‌లైన్‌లో నేరుగా జమ చేస్తున్నాయి. ఇప్పటికే ఈ సొమ్ము జమ అయింది. చివరి సంవత్సరం మిగిలి ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారనే ముందు చూపుతో ప్రభుత్వం ఇలా మినహాయించింది. బీసీ, ఇతర వర్గాల విద్యార్థులకు మాత్రం విద్యాదీవెనను రాష్ట్ర ప్రభుత్వమే జమ చేస్తోంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు విడతల సొమ్మును క్రమం తప్పకుండా ఇప్పటికే జమ చేసింది. నెలాఖరులోపు నాలుగో విడత విడుదల చేయనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఎస్సీ విద్యార్థులు మినహా మిగిలిన అన్ని కేటగిరీల్లో 1,13,443 మందికి సుమారు రూ.51 కోట్ల మేర సాయం అందనుంది.

24 లోపు ఉమ్మడి బ్యాంక్ ఖాతాలు తెరవాలి




జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనకు అర్హులైన విద్యార్థులు తల్లితో కలిసి ఈ నెల 24లోపు ఉమ్మడి బ్యాంక్ ఖాతా తెరవాలి. ఎస్సీ విద్యార్థులు, చివరి సంవత్సరం చదివే వారు ఈ ఖాతా తెరవాల్సిన అవసరం లేదు. ఉమ్మడి ఖాతా తెరిచాక ఆ వివరాలను తమ పరిధిలోని సచివాలయాలకు తెలియజేయాలి. ఉమ్మడి బ్యాంకు ఖాతా అకౌంట్ పుస్తకంలోని మొదటి పేజీ కాపీని అందించాలి. నాలుగో విడత విద్యాదీవెన పథకం నగదు విడుదలకు ఈ ప్రక్రియ తప్పనిసరి. సచివాలయ సిబ్బంది ఉమ్మడి బ్యాంక్ ఖాతా వివరాలను నవశకం లాగిన్‌లో అప్‌డేట్ చేస్తారు. ఖాతాలు తెరిచే విషయంలో తల్లిదండ్రులు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, సచివాలయ సిబ్బంది, బ్యాంక్ మేనేజర్లు సహకరించాలి.

– డీవీ రమణమూర్తి, జాయింట్ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ



మంచు తెరలపై ఉదయ భానుడి కిరణ కరవాలాలు



వరిపైరుపై మంచుపరదా : అల్లవరం మండలం కోడూరుపాడు వద్ద కనువిందు చేసిన చిత్రం



పచ్చి గడ్డిపై విరిసిన హిమసుమాలు

చలి గిలిగింతలు

నిన్నమొన్నటి వరకూ వేసవిని తలపించేలా సూర్యుడి ప్రతాపం.. దీపావళి ఇలా వెళ్లి.. కార్తిక మాసం ఆరంభమైందో లేదో.. శరత్కాలం ఒక్కసారిగా హిమరాగాలు ఆలపిస్తోంది.. ఉషోదయాన పల్లెల్ని మంచు దుప్పటి కప్పేస్తోంది.. నేల రాలిన హిమ బిందువులు పచ్చి గడ్డి పరకల చివరన ముత్యాల సుమాలై విరబూస్తున్నాయి.. చేతికి అందివస్తున్న వరి చేలను... ఏపుగా పెరిగిన కొబ్బరి తోటలను మంచు ముట్టడిస్తోంది. అసలే ప్రకృతి అందాలతో చూపరులను కట్టి పడేసే కోనసీమ.. మంచు పరదాల మాటున మరిన్ని అందాలను అద్దుకుంటోంది. జిల్లాలోని అమలాపురం, మండపేట, రాజోలు వంటి ప్రాంతాల్లో 24 డిగ్రీల సెల్సియస్ వరకూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కానీ మంచు కురుస్తుండంతో ఉదయం, రాత్రి వేళల్లో చలి గిలిగింతలు పెడుతోంది.

– సాక్షి, అమలాపురం

క్లుప్తంగా

జాతీయ నెట్‌బాల్ పోటీలకు నాగేంద్ర కుమార్



నాగేంద్ర కుమార్‌తో హెచ్‌ఎం, పీఈటీ

ఆత్రేయపురం: వాడపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఏపుగంటి నాగేంద్ర కుమార్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకట్రావు, పీఈటీ నాగబాబు మంగళవారం ఈ విషయం తెలిపారు. ఇటీవల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో నాగేంద్ర కుమార్ ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. జనవరి మొదటి వారంలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడని చెప్పారు. నాగేంద్ర కుమార్‌ను సర్పంచ్ పోచిరాజు బాబూరావు, గ్రామస్తులు, స్కూల్ కమిటీ చైర్మన్ వై.శ్రీను తదితరులు అభినందించారు.

రక్త సంబంధీకులు వస్తే శిశువును ఇస్తాం

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో ఈ నెల మూడో తేదీన దొరికిన గుర్తు తెలియని ఆడ శిశువును మంగళవారం సాయంత్రం కాకినాడ శిశుగృహకు తరలించారు. జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ సత్యవాణి ఆధ్వర్యాన ఐసీడీఎస్ అధికారులు ఈ శిశువును కాకినాడ తీసుకుని వెళ్లి శిశుగృహాలో అప్పగించారు. ఆ శిశువు దొరికినప్పటి నుంచీ అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆ శిశువు ఆరోగ్యం పూర్తిగా కుదుటపడటంతో కాకినాడ తరలించారు. శిశువు సురక్షితంగా ఉందని, ఎవరైనా రక్త సంబంధీకులు వస్తే అందజేస్తామని సత్యవాణి చెప్పారు. తగిన ఆధారాలతో కాకినాడ శిశుగృహకు వెళ్లి కూడా ఆ శిశువును తీసుకుని వెళ్లవచ్చని తెలిపారు.



కాకినాడ శిశుగృహాలో శిశువును అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

శ్రీపీఠం.. భక్తి కెరటం

- వైభవంగా మహాశక్తి యాగం ఆరంభం
- కుంకుమార్చనల వేదికపై ప్రతిధ్వనించిన లలితా సహస్రనామ స్మరణ
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



మహాశక్తి యాగంలో భాగంగా స్వయంగా శతకోటి లలితా కుంకుమార్చన చేయిస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలోని శ్రీపీఠంలో భక్తికెరటం ఎగసిపడింది. ఒకటీ రెండూ కాదు.. ఏకంగా 30 రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక మహా క్రతువుకు అంకురార్పణ జరిగింది. ప్రతి ఒక్కరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఇష్టకార్య సిద్ధి పొందాలనే లక్ష్యంతో సంకల్పించిన మహాశక్తి యాగం.. పవిత్ర కార్తిక మాస ఆరంభం రోజైన మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. యజ్ఞయాగాలు, జపతపాలు, ఇతర వైదిక క్రతువులతో ఈ ప్రాంతంలో ఈ మాసమంతా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుంది. సువాసినులు తమ ఐదోతనం చల్లగా ఉండాలని కుంకుమార్చనలతో అమ్మవారిని వేడుకుంటారు. అటువంటిది ఐశ్వర్యాంబికా సమేత సుందరేశ్వర స్వామి కొలువై ఉన్న శ్రీపీఠంలో.. నెల రోజుల పాటు జరిగే శతకోటి లలితా కుంకుమార్చన, కోటి దీపోత్సవం వంటి పూజా కార్యక్రమాల్లో నేరుగా పాల్గొనే అవకాశం లభిస్తుండటంతో వేలాదిగా మహిళలు తరలివస్తున్నారు. తొలి రోజు కుంకుమార్చనల్లో ఏకంగా 12 వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీపీఠం, గోశాల వద్ద సందడి నెలకొంది. మహిళలు శ్రీపీఠంలో పంపిణీ చేసిన వస్త్రాలు ధరించి భగవంతుడు, అమ్మవార్ల ముందు తామంతా ఒకటే అన్నట్టుగా ఐక్యతను చాటుతూ క్రమశిక్షణతో తరలిచ్చారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మహాశక్తి యాగం, బగళాముఖి అమ్మవారి విశిష్టత, హోమం, 27 నక్షత్రాలకు శాంతి పూజలు, 27 తిథి దేవతలకు పూజలు, కోటి దీపోత్సవం గురించి వివరించారు. కార్తిక మాసమంతా జరిగే ఈ మహాశక్తి యాగాన్ని ఒకే సంకల్పంగా భావించి మహిళలందరూ పాల్గొనాలని కోరారు. లలితా సహస్ర నామాలను స్వామీజీ స్వయంగా చదివి మహిళలతో కుంకుమార్చన చేయించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి బగళాముఖి హోమం, నక్షత్ర పూజలు దీపోత్సవం జరగనున్నాయని స్వామీజీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా శ్రీపీఠం వలంటీర్లు సేవలందించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ, సర్పవరం సీఐ మురళీకృష్ణ, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

వైభవంగా శోభాయాత్ర

బోట్‌క్లబ్: మహాశక్తి యాగారంభాన్ని పురస్కరించుకొని కాకినాడ నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక రిజర్వు లైన్ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి భానుగుడి సెంటర్ నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా జరిగిన ఈ యాత్రలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. కుంభకోణం నుంచి తీసుకువచ్చిన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలతో శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద స్వామీజీ ఆధ్వర్యాన ఈ యాత్ర జరిగింది. ఆద్యంతం కేరళ చెండై వాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, మహిళల కోలాటాల నడుమ యాత్ర సాగింది. హరహర మహాదేవ నామస్మరణతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా భానుగుడి సెంటర్‌లో భక్తులనుద్దేశించి స్వామీజీ మాట్లాడుతూ, ప్రపంచ పటంలో కాకినాడను ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుపుతామని అన్నారు. గతంలో ఎక్కడా చేయలేని మహాశక్తి యాగం నిర్వహించి ప్రపంచానికి చూపిస్తానన్నారు. యాగం పూర్ణాహుతి రోజున శ్రీపీఠంలో చరితాత్మక కట్టడాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు.

రేపు సామాజిక సాధికార బస్సు యాత్ర

- రావులపాలెం నుంచి భారీ ర్యాలీ
- కొత్తపేటలో బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



కొత్తపేటలో బహిరంగ సభ ఏర్పాట్లపై పోలీసు అధికారులు, నాయకులతో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన సామాజిక విప్లవం, సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఈ యాత్ర గురువారం కొత్తపేట నియోజకవర్గంలో జరగనుంది. ఈ నేపథ్యంలో కొత్తపేటలో సభాస్థలి, వాహనాల పార్కింగ్, భోజనాలు ఏర్పాటు చేసే స్థలాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కొప్పన శివనాగు, ఇన్‌చార్జి డీఎస్పీ సుంకర మురళీమోహన్, నాయకులతో కలిసి జగ్గిరెడ్డి మంగళవారం పరిశీలించారు. రావులపాలెం నుంచి భారీ ర్యాలీగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని, ఆ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. స్థానిక జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానం, శ్రీకరి శుభకరి కల్యాణ మండప ప్రాంగణాలను వాహనాల పార్కింగుకు కేటాయించనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భోజనాలకు ఏర్పాట్లు చేస్తారు. ఇక్కడ సుమారు 20 స్టాల్స్ ఏర్పాటు చేయాలని జగ్గిరెడ్డి సూచించారు. ఆ రోజు రావులపాలెం – అమలాపురం మధ్య రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ, ఇతర వాహనాలను పలివెల – రావులపాడు రోడ్డు (బొబ్బర్లంక – అమలాపురం కాలువ గట్టు రోడ్డు) మీదుగా మళ్లించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకూ వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధి, రాజకీయ పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో కల్పించిన సామాజిక న్యాయాన్ని వివరించేందుకు ఈ బస్సు యాత్ర చేపట్టామని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచీ పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో మోటార్ సైకిళ్లపై గురువారం మధ్యాహ్నం రావులపాలెం చేరుకుంటారని, అక్కడి నుంచి బస్సు యాత్రతో పాటు భారీ ర్యాలీగా కొత్తపేట పాత బస్టాండు సెంటర్‌కు చేరుతారని తెలిపారు. ఆ సమీపంలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ యాత్రలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనురాధ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, జిల్లా, ఇతర జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ సామాజికవర్గాల నాయకులు పాల్గొంటారని వివరించారు. సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, పార్టీ నియోజకవర్గ నాయకులు ఎంఎస్ఆర్, కర్రి అశోక్‌రెడ్డి, రావులపాలెం సీఐ రజనీకుమార్, ఎస్సై వి.మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్‌కు చరిష్మా సాయిరుత్వి



చరిష్మా సాయిరుత్విని అభినందిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిమ్మకాయల చరిష్మా సాయిరుత్వి ఎంపికైంది. ఎనిమిదో తరగతి చదువుతున్న ఆమె ఇటీవల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన అండర్–14 బాలబాలికల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి, రాష్ట్ర జట్టులో స్థానం సాధించింది. ఈ సందర్భంగా చరిష్మా సాయిరుత్విని పాఠశాలలో హెచ్‌ఎం కడలి సాయిరామ్ ఆధ్వర్యాన ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ మంగళవారం అభినందించారు. వచ్చే నెల రెండో వారంలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో చరిష్మా పాల్గొంటుందని హెచ్‌ఎం సాయిరామ్ చెప్పారు. ఈ ఏడాది పాండిచ్చేరిలో జరిగిన సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు సైతం చరిష్మా ఎంపికైంది. వరుసగా ఈ ఏడాది రెండుసార్లు జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఆమె ఎంపికవడం అభినందనీయమని అన్నారు. అలాగే స్కూల్ గేమ్స్ విభాగంలో ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టుకు సైతం ఎంపికవడం ద్వారా చరిష్మా ఆల్‌రౌండ్ ప్రతిభ చూపిందని తెలిపారు. ఈ సందర్భంగా చరిష్మాను, శిక్షణ ఇచ్చిన పీడీ కుంపట్ల ఆదిలక్ష్మిని ఎంఈఓలు వెంకటేశ్వరరావు, ప్రకాష్, హెచ్‌ఎం సాయిరామ్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్నపు సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, బీఎస్ఎన్ మూర్తి, పీఈటీ ఎ.సూర్యకుమారి పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభి జన్మదిన వేడుకలు



గజమాలతో పట్టాభిరామయ్యచౌదరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సత్యకృష్ణ, శ్రీకృష్ణ తదితరులు

మండపేట: వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు, కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి జన్మదిన వేడుకలు మంగళవారం మండపేట బైపాస్ రోడ్డులోని అరవింద రైస్‌మిల్లు ఆవరణలో జరిగాయి. ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, పార్టీ రాష్ట్ర నాయకులు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ డాక్టర్స్ సెల్ జిల్లా కన్వీనర్ చోడే సత్యకృష్ణ, యువజన విభాగం నాయకుడు చోడే శ్రీకృష్ణ తదితరులు హాజరై పట్టాభికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి నోట్ పుస్తకాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. నోట్ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేయనున్నట్టు పార్టీ నేతలు తెలిపారు. పట్టాభిరామయ్య చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మయూరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అలాగే అయ్యప్ప మాలధారులకు బిక్ష, వడిలను అందించారు.

సైనిక్ స్కూల్‌కు సై



- 2024–25లో 6, 9 తరగతుల్లో ప్రవేశాలు
- నోటిఫికేషన్ విడుదల
- జనవరి 21న ప్రవేశ పరీక్ష

రాయవరం: త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సైనిక్ పాఠశాలలు ఏర్పాటు చేసింది. సంపూర్ణ క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంతో పాటు, దేశభక్తిని పెంపొందించే విధంగా పాఠశాలల్లో బోధిస్తారు. రక్షణ రంగంలో ప్రవేశించడానికి అవసరమైన నైపుణ్యాలను పాఠశాల దశ నుంచే నేర్పిస్తారు. దేశవ్యాప్తంగా రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని 33 సైనిక్ స్కూల్స్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 9 తరగతుల్లో ప్రవేశానికి అఖిల భారత సైనిక పాఠశాలల ప్రవేశ పరీక్ష (ఏఐఎస్ఎస్ఈఈ–2024) నోటిఫికేషన్ విడుదలైంది. సైనిక్ స్కూల్ సొసైటీ నిబంధనల ప్రకారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది. ఎన్‌జీవోలు/ప్రైవేట్ పాఠశాలలు/రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పని చేసే 19 కొత్త సైనిక పాఠశాలలకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలు కూడా ఏఐఎస్ఎస్ఈఈ–2024 ద్వారా నిర్వహిస్తారు.

సీట్ల కేటాయిస్తారిలా..

ఆరో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2,970, ప్రైవేటు పాఠశాలలకు 5,225 సీట్లు కేటాయించారు. తొమ్మిదో తరగతికి 697 సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని కోరుకొండ (విజయనగరం), కలికిరి (చిత్తూరు), కృష్ణపట్నం(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు)లో సైనిక పాఠశాలలున్నాయి.

ఇవీ అర్హతలు

సైనిక స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశం పొందగోరే విద్యార్థుల వయస్సు 2024 మార్చి 31 నాటికి 10 – 12 ఏళ్ల మధ్య ఉండాలి. బాలికలు కూడా ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. తొమ్మిదో తరగతి ప్రవేశం పొందగోరే విద్యార్థుల వయస్సు 2024 మార్చి 31 నాటికి 13 – 15 ఏళ్ల మధ్య ఉండాలి. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

సీట్ల కేటాయింపు ఇలా:

- రాష్ట్రంలోని సైనిక్ స్కూల్స్‌లో అందుబాటులో ఉన్న మొత్తం సీట్లలో ఆ రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన విద్యార్థులకు 67 శాతం, ఇతర రాష్ట్రాల వారికి 33 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తారు.
- వీటిలో ఎస్సీ 15, ఎస్టీ 7.5, ఇతర కులాలకు చెందిన విద్యార్థులకు 27 శాతం కేటాయిస్తారు. మిగిలిన సీట్లలో 25 శాతం మాజీ సైనికోద్యోగుల పిల్లలకు, మిగిలిన 25 శాతం ఇతర రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు. ఈ కోటాలో ఒకే రాష్ట్రానికి మూడుకు మించి ఎక్కువ సీట్లు కేటాయించడానికి వీలు లేదు.

పరీక్ష కేంద్రాలు

దేశవ్యాప్తంగా 186 కేంద్రాల్లో పరీక్ష రాసే వీలుంటుంది. మన రాష్ట్రంలోని అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం పట్టణాల్లో పరీక్ష కేంద్రాలుంటాయి.

దరఖాస్తు చేసుకోవాలిలా:

అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల ఏడో తేదీ నుంచి అవకాశం కల్పించారు. దరఖాస్తుకు వచ్చే నెల 16 తుది గడువు. దరఖాస్తులో మార్పులకు డిసెంబర్ 18 నుంచి 20వ తేదీ వరకూ అవకాశముంటుంది.

- ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు రూ.500, ఇతరులు రూ.650 చొప్పున పరీక్ష రుసుం చెల్లించాలి.
- ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 21న నిర్వహిస్తారు.
- ఆరో తరగతి విద్యార్థులకు జనవరి 21వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ (150 నిమిషాలు), తొమ్మిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ (180 నిమిషాలు) ప్రవేశ పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష నిర్వహించిన ఆరు వారాల తర్వాత ఫలితాలు వెల్లడిస్తారు.

ఎంపిక, పరీక్ష ఇలా..

- విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ఒక్కో సబ్జెక్టులో కనిష్ఠంగా 25 శాతం, అన్ని సబ్జెక్టుల్లో కలిపి 40 శాతం మార్కులు సాధించాలి. దీనిలో అర్హత సాధించిన వారికి శారీరక దారుఢ్య, వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రవేశం కల్పిస్తారు.
- ఓఎంఆర్ సీట్ విధానంలో నిర్వహించే రాత పరీక్షలో సాధించే మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.
- ఆరో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులకు 125 ప్రశ్నలతో 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. గణితం సబ్జెక్టు నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. ఇంటెలిజెన్స్ లాంగ్వేజ్, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టుల నుంచి 25 ప్రశ్నల వంతున ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు. పరీక్ష కాల వ్యవధి 2.30 గంటలు ఉంటుంది.
- తొమ్మిదో తరగతిలో చేరే విద్యార్థులు 400 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. గణితం నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు ఇస్తారు. ఇంటెలిజెన్స్ ఇంగ్లిష్, జనరల్ సైన్స్, సోషల్ సైన్స్ సబ్జెక్టుల నుంచి 25 ప్రశ్నల వంతున 100 ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు. మూడు గంటల వ్యవధిలో పరీక్ష రాయాలి.
- తొమ్మిదో తరగతి విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాయాలి.
- ఆరో తరగతి విద్యార్థులు ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడం, మళయాలం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్ష రాసే అవకాశముంటుంది.

పారదర్శకంగా కులగణన

వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నుపూర్ అజయ్



అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మకంగా చేపడుతున్న కులగణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి లోపాలకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. కులగణన ప్రక్రియపై గ్రామ/వార్డు సచివాలయ శాఖ కమిషనర్ హెచ్ఎం ధ్యాన్‌చంద్ర, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ విజయ్ కృష్ణన్, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారులు అమరావతి నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణనపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, డీఎల్‌డీఓలు, మాస్టర్ ట్రైనీలకు సాంకేతిక బృందం అవగాహన కల్పించింది. అనంతరం జేసీ నుపూర్ అజయ్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వలంటీర్ మొబైల్ యాప్, వలంటీర్ ఈ–కేవైసీ క్యాప్చర్ ద్వారా కులగణనను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యులతో సామరస్యంగా చర్చించి, ఎటువంటి వివాదాలకూ తావు లేకుండా కులగణన పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, సాంఘిక, బీసీ సంక్షేమ అధికారులు పి.జ్యోతిలక్ష్మీదేవి, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.800 వ్రతం చార్జీ పెంపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో రూ.800 వ్రతం టికెట్‌ను మంగళవారం నుంచి రూ.వెయ్యికి పెంచారు. దీనిపై ఈ నెల మూడో తేదీన జరిగిన సమావేశంలో ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ధర్మకర్తల మండలి ఆమోదించింది. ఈ నేపథ్యంలో దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ పెంపుదలపై ఆదేశాలిచ్చారు. కాగా, దేవస్థానంలో రూ.300, రూ.1,500, రూ.2 వేల వ్రతాల టికెట్ల ధరలు మాత్రం పెంచలేదని ఈఓ తెలిపారు.